సాక్షి కాకినాడ

శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షలు


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి స్థానికులైన అడ్డాల రామకృష్ణ గణపతి, ఆయన తల్లి వరలక్ష్మి రూ.లక్ష చొప్పున విరాళం ఇచ్చారు.



ఇంటింటా వరాలమ్మకు ఆహ్వానం

శ్రావణం దేవతలకు ఇష్టమైన మాసమని పురాణాలు చెబుతున్నాయి. ముత్తైదువలు, దీర్ఘ సుమంగళీతనం కోసం ఆచరించే వరలక్ష్మి వ్రతానికి ప్రాముఖ్యం ఉంది. - 8లో

2.19 లక్షల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 2,19,982 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,750 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఎల్‌బ్రోస్‌పై త్రివర్ణ పతాకం



ఎల్‌బ్రోస్ పర్వతంపై ఇండియా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా ఫారెస్ట్ అధికారి భరణి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా ఫారెస్టు అధికారి ఎస్.భరణి యూరప్‌లోనే అతి ఎత్తైన పర్వతం ఎల్‌బ్రోస్ 5,642 మీటర్లు (18,505 అడుగులు) ఎక్కి త్రివర్ణ పతాకాన్ని గురువారం ఉదయం 12.30 గంటలకు ఎగురవేశారు. ఈమె కాకినాడ జిల్లా అధికారి కావడం జిల్లాకు గర్వకారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంతటి ఘనత సాధించిన డీఎఫ్ఓ భరణిని జిల్లా అధికారులు అభినందించారు.

28 మంది ఎంపీడీవోల బదిలీ

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చిన 28 మంది మండల ప్రజాపరిషత్ అధికారులను జెడ్పీ సీఈవో ఏ శ్రీరామచంద్రమూర్తి తిరిగి ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేశామని జెడ్పీ సీఈవో వివరించారు.

వీరజవాన్ల కుటుంబీకులకు సత్కారం



వీరమరణం పొందిన కుటుంబీకులను సత్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

కాకినాడ సిటీ: భారత సైనంలో సేవలందించడంతో పాటు యుద్ధభూమిలో వీరమరణం పొందిన కాకినాడ జిల్లా సైనికుల కుటుంబాలను గురువారం కాకినాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. 1971లో జరిగిన యుద్ధంలో మరణించిన కె భాస్కర్, 2004లో జరిగిన ఆపరేషన్ మేఘదూత్‌లో మరణించిన పి శ్రీనివాసరావుల కుటుంబీకులైన కె.రత్నకుమారి, పి.జ్యోతి పద్మలను పవన్‌కళ్యాణ్ దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు.

అదుపులోకి పంపా నీటి లీకేజీ

అన్నవరం: స్థానిక పంపా బ్యారేజీ నాలుగో నంబర్ గేటు నుంచి వృథాగా పోతున్న నీటి లీకేజీని చాలా వరకు అదుపు చేశారు. నాలుగో నంబర్ గేటు అడుగున గడ్డి వేసి నీరు లీకేజీని అదుపు చేసినట్టు పెద్దాపురం ఇరిగేషన్ ఈఈ శేషగిరి రావు గురువారం 'సాక్షి'కి తెలిపారు. అయితే గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు అయ్యే వరకు వంద అడుగులకు మించి నీటిమట్టం ఉండకుండా చర్యలు తీసుకోవాలని సీతానగరం ఇరిగేషన్ వర్క్‌షాపు సిబ్బంది తెలిపారని వివరించారు. అందువల్ల బ్యారేజీ గేట్ల కింద నుంచి స్వల్ప స్థాయిలో నీరు లీకేజీ అవుతున్నా బ్యారేజీ గేట్లపై నీటి ఒత్తిడి తగ్గించేందుకు ఆ లీకేజీని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 99.50 అడుగులు ఉందన్నారు.



స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ షన్మోహన్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న డి తిప్పేనాయక్, డీఆర్వో









డాక్టర్ నరసింహనాయక్, జిల్లా వైద్యాధికారి, కె శ్రీరమణి, డీఆర్‌డీఏ పీడీ, అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ, డాక్టర్ రాధాకృష్ణ, ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్, కెఎస్‌వీ సుబ్బారావు, ఆర్డీవో కార్యాలయం, కాకినాడ, నాగార్జున, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్, దంగేటి రాంబాబు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి, చేనేత, జౌళిశాఖ

ప్రజలు మెచ్చేలా పాలన

- రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అడుగులు వేస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్



కవాతు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కాకినాడ సిటీ: ప్రజలంతా మెచ్చేలా, భావితరాలకు స్ఫూర్తి పంచేలా కూటమి పాలన సాగుతుందని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ అన్నారు. గురువారం కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం సమర్పించిన సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అడుగులు వేస్తున్నామని చెప్పారు. శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తామని అన్నారు. లక్షమంది యువతను సేంద్రియ రైతులుగా మారుస్తామన్నారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ వేదిక కావాలని, అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల్లో మేటిగా ముందుకు సాగుతామన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఆడబిడ్డా భద్రంగా తిరిగి రావాలని, దోపిడీలు, దౌర్జన్యాలు నశించే రోజులు సాకారం కావాలన్నారు. మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కృతం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధితో పాటు సంక్షేమ రథం ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని ఇవే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యాలు అని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన అధికార బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ వారు పెట్టుకున్న నమ్మకాన్ని కచ్చితంగా నెరవేరుస్తామన్నారు. ప్రజాధనాన్ని అక్రమంగా దోచుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టప్రకారం వారికి శిక్షపడాలని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, పరేడ్‌ను తిలకించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు ఆసక్తిగా చూశారు. కాకినాడ జిల్లాలో 17 కేటగిరిల్లో 2,77,594 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఆంధ్రుల అన్నపూర్ణగా భావించే డొక్కా సీతమ్మ పథకంతో జిల్లాలోని 1,258 పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామన్నారు. అన్నా క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించి పేదలకు రూ.5కే భోజనం అందించే కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. జిల్లాలో 11 అన్నా క్యాంటీన్లు ప్రారంభమవుతున్నాయన్నారు. ఇసుక విధానంలో మార్పులు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాలో 37 కౌంటర్లలో ప్రజలకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరకే అందిస్తున్నాం, పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం అన్నారు. కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ పాల్గొన్నారు.



బి. నాగార్జున, వీడియో గ్రాఫర్, ఐఅండ్‌పీఆర్



భారతి సౌజన్య, జిల్లా పంచాయతీ అధికారి

ఉత్తమ సేవలకు అవార్డులు

61 డిపార్టుమెంట్లలో187 మంది ఉద్యోగులకు ప్రదానం

కాకినాడ సిటీ: 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గురువారం జిల్లాలో వివిధ డిపార్టుమెంట్లలో ఉత్తమ సేవలు అందించిన 187 మందికి ఉత్తమ అవార్డులను, ప్రశంసా పత్రాలను గురువారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి అందజేశారు. అధికారులందరికీ అవార్డులకు సంబంధించి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, సీఈవో పి త్రినాథ్, ఆడిట్ అధికారి వై.సురేష్‌బాబు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి జి శ్రీనివాసరావు, జిల్లా వైద్యాధికారి జె. నరసింహనాయక్, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, సివిల్ సప్‌లై అధికారి ఎం.వి జయకుమార్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ పి.రాధాకృష్ణ, ఐఅండ్ పీఆర్ డీడీ డి.నాగార్జున, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎంపీ మల్లికార్జునరావు, డీటీసీ ఎ.మోహన్, కాకినాడ సెజ్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి, పెద్దాపురం ఆర్డీవో జె.సీ తారామారావు, కాకినాడ ఆర్డీవో ఐ. కిషోర్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌డీసీ ఎం.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్.రామమోహన్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ ఎంవీఎస్ఎస్ఎస్ జగన్నాథం, సీహెచ్ సంధ్యారాణి, టి.దుర్గాప్రసాద్, పీవీవీ సత్యనారాయణ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరితో పాటు మరో 132 మందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన



గృహనిర్మాణశాఖ శకటం



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటం

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్, ఎన్‌సీసీ దళాలు నిర్వహించిన సంప్రదాయ కవాతు ఆహూతులను అలరించింది. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్కు ప్రథమ, ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్‌కు ద్వితీయ, ఎన్‌సీసీ 8 ఆంధ్రా బృందాలకు తృతీయ బహుమతిని ముఖ్య అతిథి ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, కలెక్టర్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 11 శకటాలు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని ప్రదర్శించాయి. తొలుత దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి ఆలయ శకట ప్రదర్శన జరిగింది. వరుసగా జిల్లా పౌరసరఫరాల సంస్థ (రైతు సేవాల కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు విధానం), గృహనిర్మాణసంస్థ (ప్రధానమంత్రి అవాస్ యోజన) విద్యాశాఖ (అబ్దుల్ కలాం, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం), కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ (అన్నా క్యాంటీన్, బోటు బిల్డింగ్ యార్డ్), గ్రామీణ నీటి సరఫరా శాఖ (పారిశుద్ధ్యం, జల్ జీవన్ మిషన్ ఇంటింటికీ తాగునీరు), జిల్లా నీటి యాజమాన్య సంస్థ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మంచినీటి చెరువులు, మొక్కలు పెంపకం, జలకళ), వైద్య ఆరోగ్యశాఖ (108, 104, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఏఎన్ఎం, ఆశవర్కర్లు), జిల్లా పర్యటకశాఖ (సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధి), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్టీయార్ భరోసా పింఛన్ల పంపిణీ), రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శకటాలు ఆకట్టుకున్నాయి. పోలీసు జాగిలాలు చేసిన వివిధ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. శకటాల ప్రదర్శనలో విద్యాశాఖకు ప్రథమ , గృహ నిర్మాణ సంస్థకు ద్వితీయ, జిల్లా గ్రామీణ నీటి సరఫరాకు తృతీయ బహుమతి దక్కించుకున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

78వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెప్పాయి. శంఖవరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కాకినాడ జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ హైస్కూల్, ఉమా మనో వికాస కేంద్రం, కాకినాడ ఆదిత్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, శాలిపేట మున్సిపల్ కార్పొరేషన్ బాలికల పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉమా మనోవికాస కేంద్రానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు నృత్య ప్రదర్శన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిన్నారుల వద్దకు స్వయంగా వెళ్లి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రథమ బహుమతిని కాకినాడ జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థులకు, ద్వితీయ బహుమతి ఆదిత్య ఇంగ్లిష్ మీడియ స్కూల్, తృతీయ బహుమతి శంఖవరం కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అందజేశారు.

ప్రభుత్వ పథకాల సమాచారంతో స్టాళ్లు

స్వాతంత్ర్య సమర యోధుల ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన, ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, సెరికల్చర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, వ్యవసాయం, అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల డ్వాక్రా ఉత్పత్తులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గిరిజన సంక్షేమ శాఖల కార్యకలాపాలు స్టాళ్లు, జిల్లా పంచాయతీ, జిల్లా పరిషత్తు, పశుసంవర్థక, మత్స్యశాఖల స్టాళ్లను ఏర్పాటు చేశాయి. వీటిలో ఉత్తమ స్టాళ్లుగా జిల్లా పంచాయతీ, ఉద్యాన సెరికల్చర్ ఏపీఎంపీఎంఐపీ, స్వతంత్ర సమరయోధుల ఆర్ట్ గ్యాలరీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు అందుకున్నాయి.



జిల్లా విద్యాశాఖ శకటం



జిల్లా అగ్నిమాపక శకటం



జిల్లా పర్యాటక శాఖ శకటం

టీడీపీ నాయకుల అరాచకం

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌పై దాడి

శంఖవరం: జాతీయ జెండాను ఎగురవేసే అర్హత పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌కే ఉంటుంది. అయితే టీడీపీ నాయకులు దౌర్జన్యంతో జెండాను ఎగురవేసే సమయంలో సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యాన్ని అడ్డుకుని ఏకంగా టీడీపీ నాయకులు ఎగురవేసిన ఘటన మండపంలో చోటు చేసుకుంది. సర్పంచ్ కూనిశెట్టి వివరాల ప్రకారం స్థానిక సచివాలయం కార్యాలయం వద్ద గురువారం 78వ స్వాంతంత్ర వేడుకలు జరుగుతున్న సమయంలో టీడీపీ నాయకులు పాలం చిన్నా, సుంకర వెంకట సూరి, నక్కా నేగేశ్వరరావు, ఊటుకూరి బాబులు, ఊటుకూరి సూరిబాబుతో సహ పలువురు ఒక్కసారిగా వచ్చి తనపై దాడి చేసి జెండా వందనాన్ని అడ్డుకున్నారన్నారు. గ్రామ ప్రథమ పౌరుడైన నన్ను అడ్డుకుని, అవమానించి వారే జెండాను ఎగురవేశారన్నారు. పంచాయతీల్లో పార్టీలతో సంబంధం లేకుండా జెండాను ఎగురవేసే హక్కు సర్పంచ్‌కే ఉంటుందన్నారు. ఈ ఘటనపై అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్ టీడీపీ నాయకులకు జెండాను ఎగురవేసే హక్కు సర్పంచ్‌కు ఉంటుందని వారించినా వారు పట్టించుకోలేదన్నారు. కార్యదర్శి ఈ సంఘటనపై ఎంపీడీఓ ఎం.విజయ్‌కుమార్‌కు ఫిర్యా దు చేశారన్నారు. అన్నవరం ఎస్సై వి.కిశోర్‌ను వివరణ కోరగా దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.



మండపంలో సర్పంచ్‌పై దాడి చేసిన అనంతరం దౌర్జన్యంగా జెండాను ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు

జెండా వందనంలో దళిత సర్పంచ్‌కు అవమానం

- కుల వివక్షతో జెండా వందనానికి హాజరుకాని కార్యదర్శి, సిబ్బంది
- కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తానన్న సర్పంచ్ మేరీఅవినాష్



కార్యదర్శి, సిబ్బంది పాల్గొనకున్నా జెండా వందనం చేస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్, తదితరులు

తుని రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనకుండా దళిత సర్పంచ్‌నైన తనను పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ సిబ్బంది అవమానించారని మండలంలోని హంసవరం గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ గురువారం ఆరోపించారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ ఎటువంటి పదవులు లేని నాయకుడి రాకకోసం ఎదురుచూస్తూ సర్పంచ్‌నైన తనను అవమానించారన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉండగా వార్డు సభ్యులతో కలసి తాను పది గంటల వరకు నిరీక్షించానన్నారు. కుల వివక్షతో కాలిబోయిన గంగారావు వస్తేనే జెండా వందనం చేస్తానని కార్యదర్శి స్పష్టం చేయడంతో తాను ఆవేదనకు గురైనట్టు సర్పంచ్ ఆరోపించారు. సమయం మించిపోతుండడంతో వార్డు సభ్యులు, స్థానికులతో కలసి తాను పది గంటల తర్వాత జెండా ఆవిష్కరణ చేశానన్నారు. సచివాలయంలో కూర్చుని కార్యదర్శి శంకర్, సిబ్బంది జెండా వందనం కార్యక్రమంలో పాల్గొనకపోవడంపై సర్పంచ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తుని తహసీల్దార్, ఎంపీడీఓ, రూరల్ ఎస్సై, సీఐ, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తానన్నారు. దీనిపై కార్యదర్శి శంకర్‌ను వివరణ కోరగా ఒక వార్డు సభ్యుడు రాకపోవడంతోనే జెండా వందనం కార్యక్రమం ఆలస్యమయ్యిందని పేర్కొన్నారు. ఇందులో కుల వివక్ష లేదని పేర్కొన్నారు. విషయం తెలియడంతో గ్రామంలో దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్ష ప్రదర్శించిన కార్యదర్శిపై జై భీమ్ మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హింస లేకుండా ఉద్యమాన్ని నడిపిన ఘనత దేశానిది

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవం

కాకినాడ రూరల్: హింసకు తావులేకుండా ఉద్యమాన్ని నడిపిన ఘనత భారతదేశానికి దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రమణయ్యపేట వైద్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం చేశారు. కన్నబాబు మాట్లాడుతూ ఇంత పెద్ద ప్రజా స్వామ్య దేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. మనం దేశం పట్ల, మట్టి పట్ల ప్రేమగా ఉండాలి. దేశం కోసం జన్మ సార్థకం చేసుకోవాలని అన్నారు. గాంధీ, నెహ్రూ, పటేల్ ఇలా ఎంతో మంది పోరాటాలు, త్యాగాలతో మనం ఇలా ఉన్నామన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమయ్యిందన్నారు.

ఐదేళ్లలో జగన్ అద్భుత పాలన అందించారు

ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పరిపాలన అందించారని కన్నబాబు పేర్కొన్నారు. కానీ దురదృష్టవశాత్తూ 2024ఎన్నికల్లో ఓటమి పాలయ్యామని, ఓటమి శాశ్వతం కాదన్నారు. పగలు, రాత్రి, చీకటి, వెలుగు ఎలా ఉంటాయో గెలుపు, ఓటమి పక్కపక్కనే ఉంటాయని ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ఎంపీపీ బందిలి వీరేష, ఎంపీటీసీ సభ్యుడు నందిపాటి శ్రీనివాస్, నాయకులు కురసాల సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, గీసాల శ్రీను, మాజీ కార్పొరేటరు ఐ.శ్రీను పాల్గొన్నారు.



సందేశం ఇస్తున్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

క్లుప్తంగా

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామం వద్ద గురువారం ఓ వ్యక్తి మోటార్ సైకిల్ ఢీకొని మృతి చెందాడు. దీనికి సంబంధించి అయినవిల్లి ఎస్సై బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాజోలు నుంచి అయినవిల్లి వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్న వడ్డేపల్లి శ్రీనివాసరావు (55)ను ముక్తేశ్వరం నుంచి అమలాపురం వైపు వస్తున్న మరో మోటార్ సైకిలిస్టు అతి వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అంబులెన్స్‌లో మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిని భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దేశభక్తి పరుడికి సత్కారం



అప్పారావును సత్కరించిన యువకులు

సామర్లకోట: స్థానిక బ్రాహ్మణ అగ్రహారంలో నివాసం ఉంటున్న 101 సంవత్సరాల దివిటి అప్పారావును స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యువత ఘనంగా సత్కరించింది. యువతలో దేశభక్తి కలిగించడమే లక్ష్యంగా ఆయన 10 ఏళ్లగా జాతీయ జెండాను భుజాన వేసుకొని పెద్దాపురం నియోజకవర్గం అంతా తిరుగుతూ ఉన్నాడు. ఎవరైనా డబ్బులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే నిరాకరించడంతో పాటు కాలినడకనే ఎంత దూరం అయినా వెళుతూ ఉంటాడు. 60 ఏళ్ల వయస్సులోనే నడవలేక పోతున్న రోజుల్లో 101 సంవత్సరాల వయస్సులోని కాలినడకనే తిరుగుతూ దేశభక్తి కోసం జాతీయ జెండాను మోస్తున్న అప్పారావును సత్కరించాలని నియోజకవర్గ శోభాయాత్ర నిర్వాహకుడు కర్రి అప్పలరాజు నిర్ణయించారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న వివేకానంద గ్రంథాలయంలో యువత సత్కరించారు. పెద్దాపురం మాతృత్వ సేవా సంస్థ, ఫేజ్ బుక్ ఫ్రెండ్స్, శోభా యాత్ర నిర్వాహకులు దివిటి అప్పారావును సత్కరించారు.

కుండలేశ్వరుడి దేశభక్తి



త్రివర్ణాలంకరణలో స్వామివారు

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక రంగులతో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ అర్చకుడు కాళ్లకూరి కామేశ్వరశర్మ కుండలేశ్వర స్వామిని జాతీయ పతాకం రంగులున్న పూలతో సుందరంగా అలంకరించారు.

ఇంటింటా వరాలమ్మకు ఆహ్వానం

- నేడు వాడవాడలా వరలక్ష్మి వ్రతం
- వ్రతమాచరించనున్న మహిళలు
- మార్కెట్లకు శ్రావణ శోభ



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు



వరలక్ష్మీ రూపులు

రాయవరం: శ్రావణం దేవతలకు ఇష్టమైన మాసమని పురాణాలు చెబుతున్నాయి. ముత్తైదువలు, దీర్ఘ సుమంగళీతనం కోసం ఆచరించే వరలక్ష్మీ వ్రతానికి విశేష ప్రాముఖ్యం ఉంది. శ్రావణ మాసం శుక్లపక్షంలో పౌర్ణమికి మొదట వచ్చే శుక్రవారం రోజు వరలక్ష్మీ వ్రతం మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైనది. అష్టలక్ష్మి రూపాన్ని మహిళలు వరలక్ష్మిగా కొలుస్తారు. దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని వివాహితులు, మంచి భర్త లభించాలని యువతులు వ్రతం ఆచరిస్తారు. ఈ వ్రతం ఆచరించడం ద్వారా అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయని భక్తుల నమ్మకం. వ్రతం రోజున వేకువనే ఇంటిని శుభ్ర పర్చుకుని, గుమ్మాలకు పచ్చని మామిడి తోరణాలు, బంతిపూలను కట్టి అందంగా తీర్చిదిద్దుతారు. వ్రతం నిర్వహించే ప్రదేశంలో పిండితో ముగ్గు వేసి, కలశానికి పసుపు పూసి, నీటితో నింపి మామిడి ఆకులు, కొబ్బరికాయను ఉంచి కొత్త రవికెను కలశంపై ఉంచి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. అష్టోత్తర శతనామాలతో దేవిని పూజించి షడ్రసోపేతమైన మహా నైవేద్యాన్ని ఉంచి భుజిస్తారు. చుట్టుపక్కల ఉన్న సువాసినులను వ్రతానికి పిలిచి వాయనాలు, తాంబూలాలు అందజేసి పూజ ముగిస్తారు. ఇళ్లతో పాటు ఆలయాల్లోనూ వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాల్లో నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

పూలు, పండ్లకు గిరాకీ

మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మీ వ్రతం పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్ సందడిని సంతరించుకుంది. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి పూజా సామగ్రి విక్రయాలు చేపట్టారు. వ్రతానికి అవసరమైన పసుపు, కుంకుమ, గంధం, పూలు, మామిడాకులు, అరటిపండ్లు, అమ్మవారి ఫొటో, కలశం, కొబ్బరి కాయలు, తమలపాకులు, వక్కలు తదితర పూజా వస్తువులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పూలకు, పండ్లకు, కొబ్బరికాయలకు గిరాకీ పెరిగింది. కిలో చేమంతి పూలు రూ.400 వరకు ధర పలుకుతున్నాయి. కొబ్బరి కాయ ధర రూ.20 నుంచి రూ.30 పలుకుతుండగా, అరటిపండ్లు డజను రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. ఒక్కో తామరపూవు రూ.25 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. వరలక్ష్మీ వ్రతం విశిష్టత నేపథ్యంలో మహిళల భక్తిని వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ఇక పండ్ల ధరలు చెప్పనక్కరలేకుండా ఉన్నాయి. అలాగే ఇళ్లకు వచ్చి వ్రతాలు చేసే పురోహితులకు సైతం డిమాండ్ పెరిగింది.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు (ఫైల్)

రూపు అంటే మాటలా!

శుభప్రదమైన శ్రావణమాసంలో వ్రతం చేస్తే సిరిసంపదలకు లోటుండదనేది భక్తుల విశ్వాసం. అయితే శ్రావణంలో పూజలు చేయాలంటే మార్కెట్‌లో పెరిగిన ధరలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని రూ.5 వేలు అయినా అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంప్రదాయంగా పూజలో ఉంచే లక్ష్మీదేవి బంగారం రూపు, నూతన వస్త్రాలు, పండ్లు, పూల ధరలు మహిళలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ మాసంలో బంగారం కొంటే మంచిదని మహిళల నమ్మకం. వరలక్ష్మీ పూజకు విధిగా బంగారం రూపు ఉండాలని వారు కోరుకుంటారు. ప్రస్తుతం తులం బంగారం రూ.85,150 పలుకుతోంది. అణా బరువున్న వరలక్ష్మీ రూపు రూ.5,500 వేలు ఉంది. గ్రాము రూపు రూ.7,500 చెప్తున్నారు. వరలక్ష్మీ రూపులు రూ.2,000, రూ.4000, రూ.5,000 ధరల్లో లభిస్తున్నాయి. తక్కువ ధరకు కొంటే అందులో పైపూత తప్ప లోపలంతా రాగే. ఈ పరిస్థితుల్లో మంచి రేటు పెట్టి కొనకుంటే వరలక్ష్మీ రూపు రావడం గగనమే.

సకల శుభాలు కలుగుతాయి

శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయి. తొమ్మిది సూత్రాలతో కూడిన దారాన్ని అమ్మవారి విగ్రహం వద్ద ఉంచి వ్రతపూజలు చేసుకుని కుడిచేతికి కట్టుకుంటే ఎంతో మంచిది. వరలక్ష్మీ వ్రతాన్ని ఎవరి శక్తి కొలది వారు చేసుకోవాలి.

– కూర్మెళ్ల శివ, పురోహితుడు, రాయవరం

బధిర క్రీడాకారుడికి చేయూతనివ్వండి



ఉమ్మిడి ఏసు కుమార్

పిఠాపురం: ఆసియా, పసిఫిక్ బధిర బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌నకు భారత దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మిడి ఏసు కుమార్‌కు ఆర్థిక సాయం అందించి ఆ పోటీలో పాల్గొనే అవకాశం కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు దాతలను కోరుతున్నారు. ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ (డీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆస్ట్రేలియా దేశం మెల్‌బోర్న్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి 29 వరకూ జరుగుతాయని, ఇంత మంచి అవకాశాన్ని దక్కించుకున్న ఏసుకుమార్ పిఠాపురానికి గర్వకారణమన్నారు. దేశ వ్యాప్తంగా 12 మందికి అవకాశం రాగా, తెలుగురాష్ట్రాల నుంచి అతనొక్కడే ఎంపికయ్యారని ఆయన అన్నారు. పోటీలకు వెళ్లి వచ్చేందుకు అయ్యే ఖర్చును క్రీడాకారులే భరించాలని ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ డఫ్ షరతు విధించిందని, అక్కడకు వెళ్లేందుకు రూ.2.06 లక్షల ఖర్చవుతుందని ఆ మొత్తాన్ని భరించే స్థితి అతని కుటుంబానికి లేదని మాణిక్యాలరావు పేర్కొన్నారు. తండ్రి సుబ్బారావు మరణం తర్వాత తల్లి వెంకట లక్ష్మితో కుమార్ వెల్డింగ్ షాపులో పనిచేస్తూ ఆమెకు ఆసరాగా ఉన్నాడన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్ బాస్కెట్ బాల్ కోర్టులో శిక్షణ పొందిన ఏసు కుమార్ అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడన్నారు. దాతలు ఉమ్మిడి వెంకట లక్ష్మి అకౌంట్ నెంబర్ 043210100139503, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పిఠాపురం బ్రాంచ్ ఐఎఫ్‌ఎస్‌ఈ కోడ్ యూబీఐఎ 804321కు కానీ, ఉమ్మిడి ఏసు కుమార్ ఫోన్ పే నెంబర్ 9347199153 సాయం చేయవచ్చని ఆయన కోరారు.

శ్రీ ప్రకాష్‌లో నృత్య సంధ్య వేడుకలు



నృత్య సంధ్య వేడుకల్లో గీతాలాపన చేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం నృత్య సంధ్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మానవుని మేధస్సు నుండి ఉద్భవించిన అద్భుత విషయాలలో కళ ఒకటని, కళను ఆదరించడం, అభిమానించడం కళాత్మకతకు అద్దం పడతాయన్నారు. తెలుగు సాహిత్యంలో కవిత్వానిది ప్రత్యేక స్థానమని, పద్యం రాయడం ఒక తపస్సు అయితే, పదమును గానం చేయడం తపమేనన్నారు. కలరీ పయట్టు అనే ప్రాచీన యుద్ధ విద్యకు సంబంధించి విన్యాసాలను కేరళకు చెందిన కృష్ణదాస్, కుమార్తె కావ్యలు 45 రోజుల పాటు విద్యార్థులకు నేర్పించి మంచి ప్రదర్శన ఇవ్వడం సంతోషమన్నారు. పాఠశాల డైరక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ సాంప్రదాయ విలువలు, సంస్కృతి పునాదులుగా చేసుకుని భారతీయతకు అద్దం పడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విద్యార్థుల భవితకు బాటలు వేయడమే శ్రీప్రకాష్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో లారీ, బైక్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మండపేట: పట్టణంలోని బైపాస్ రోడ్డులోని మెకానిక్ షెడ్డు వద్ద గురువారం మంటలు చెలరేగాయి. ప్రమాదంలో లారీ, బైకు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం బైపాస్ రోడ్డులోని గంగరాజు మెకానిక్ షెడ్‌లో లారీ మరమ్మతుల్లో భాగంగా గ్యాస్ కటింగ్ చేస్తుండగా ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. డీజిల్ ట్యాంకుకు లీకేజీ ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్టు చెప్తున్నారు. లారీకి సమీపాన ఉన్న బైక్ సైతం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గురైన లారీ రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన అబ్బిరెడ్డి సింహాచలానికి చెందినదిగా గుర్తించారు.

టిఫిన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

రూ.1.5 లక్షల ఆస్తినష్టం



టిఫిన్ హోటల్‌లో చెలరేగుతున్న మంటలు

అయినవిల్లి: మండల కేంద్రమైన ముక్తేశ్వరం సెంటర్‌లోని దేవీగణేష్ ప్లాజాలో ఉన్న టిఫిన్ హోటల్‌లో గురువారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. దీనికి సంబంధించి స్థానికులు, హోటల్ యజమాని, అమలాపురం ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముక్తేశ్వరం సెంటర్‌లోని దేవీ గణేష్ ప్లాజాలో నిర్వహిస్తున్న చిట్టూరి ఏడుకొండలుకు చెందిన హోటల్‌లో టిఫిన్లు తయారు చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. హోటల్ యజమాని, సిబ్బంది అక్కడి నుంచి దూరంగా వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ప్రమాదంలో టిఫిన్ తయారీకి సంబంధించిన సామాన్లు, విద్యుత్ పరికరాలు, ఫర్నిచర్ పూర్తిగా కాలిబుడిదయ్యాయి. స్థానికుడు పాస్టర్ పాల్ ఇచ్చిన సమాచారంతో విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లినట్టు ఫైర్ ఆఫీసర్ మురళీ కొండబాబు తెలిపారు.

'అత్యవసర' సేవలకు జూడాలు దూరం

- కోల్‌కతా పీజీ విద్యార్థినిపై హత్యాచారానికి సంఘీభావం
- రోగులు, వారి బంధువులను తమకు మద్దతు తెలపాలని విన్నపం



జీజీహెచ్‌లో నిరసన ప్రదర్శన చేపడుతున్న జూడాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కొనసాగుతున్న అత్యవసర వైద్య సేవలను జూనియర్ డాక్టర్లు బహిష్కరించారు. కోల్‌కతాలో ఆర్‌జీ కార్ వైద్య కళాశాలకు చెందిన పల్మనాలజీ పీజీ విద్యార్థిని దారుణ హత్యాచారం నేపథ్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా శాంతియుత నిరసన చేపడుతున్న జూడాలు గురువారం నుంచి అత్యవసర సేవలకు కూడా హాజరుకావద్దని నిర్ణయించుకున్నారు. ఘటన జరిగిన వైద్య కళాశాల ఆవరణలో నిరసన చేస్తున్న వైద్య విద్యార్థులపై బుధవారం అర్ధరాత్రి వేల మంది రౌడీ మూకలు దాడికి తెగబడ్డాయని కాకినాడ జీజీహెచ్‌లో నిరసన చేపడుతున్న ఆర్ఎంసీ జూనియర్ డాక్టర్లు తెలిపారు. దారుణం జరిగిన హాల్‌ని ధ్వంసం చేసి సాక్ష్యాలు లేకుండా చేశారన్నారు. ఈ ఘోరాన్ని దేశమంతా చూసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, వైద్యుల సంరక్షణ కోసం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఎఫ్ఏఐఎంఏ ఆదేశాల మేరకు తమ నిరసన నిరవధికంగా కొనసాగుతుందన్నారు. నిరసన నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్‌లోని పోర్టికో వద్ద జూనియర్ డాక్టర్లు పలువురు రోగులతో మాట్లాడారు. అత్యవసర వైద్య సేవలు జీజీహెచ్‌లో కొనసాగుతాయనీ, కేవలం జూనియర్ డాక్టర్లు మాత్రమే హాజరుకారనీ నిరసనలో కొనసాగుతారని తెలిపారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన దారుణాన్ని పలువురు రోగులు, వారి బంధువులకు వివరించారు. తమ నిరసనకు సంఘీభావం తెలపాలని కోరారు. గురువారం జూడాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జీజీహెచ్ ఆవరణలో నిరసనలో పాల్గొన్నారు. సాయంత్రం పీఆర్ కాలేజ్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి దారుణంపై ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాటి ర్యాలీలో యూజీ విద్యార్థులు కూడా పాలుపంచుకోనున్నారు.

ఉలిమేశ్వరంలో ఇరువర్గాల దాడి



టీడీపీ నాయకుల దాడిలో చెయ్యి విరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటరమణ

పెద్దాపురం: మండలంలోని ఉలిమేశ్వరంలో ఇరువర్గాల మధ్య గురువారం సాయంత్రం జరిగిన దాడుల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దాపురం పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇరువురు యువకుల మధ్య జరిగిన సంభాషణ చిలికి చిలికి ఇరువర్గాల దాడులకు దారి తీసిందన్నారు. గ్రామ వైఎస్సార్ సీపీ సర్పంచ్ ఆకుల వరలక్ష్మి స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ చేస్తుండగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పేకేటి దొరబాబు స్థానిక యువతతో వ్యక్తిగత తగదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన పల్నాటి శివ, పల్నాటి వెంకటరమణ తదితరులతో వివాదానికి దిగారు. అక్కడే ఉన్న సర్పంచ్ భర్త వీరబాబు ఇది పద్ధతి కాదని వారిని వారించి అక్కడి నుంచి పంపేయడంతో ఉదయం ఎవరికి వారు వెనుదిగారు. సాయంత్రం సమయంలో గ్రామ సెంటర్‌లో అందరూ ఉండగా అక్కడ ఉన్న ఓ పెద్దాయన కురెమెళ్ల మూలయ్య చేతిలో ఉన్న కర్రను తీసుకుని వెంకటరమణ, శివలపై దొరబాబు, ఆయన తమ్ముడు రామచంద్రరావు తీవ్ర పదజాలంపై కర్రలు, కత్తితో దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల మధ్య తీవ్ర దాడి జరిగిందని పోలీసులు తెలిపారు. దీనిపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ఇరువర్గాల ఫిర్యాదులతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

భార్య హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు జాన్‌ను చూపుతున్న పోలీసులు

మధురపూడి: సీతానగరం మండలం పురుషోత్తపట్నం కొత్తకాలనీలో ఈ నెల 13వ తేదీన భార్యను అతికిరాతకంగా హత్యచేసిన నిందితుడు చెట్ల జాన్‌ను అరెస్టు చేసినట్టు కోరుకొండ సీఐ అడపా నాగమురళి తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో భార్యపై అనుమానంతో కత్తితో హత్యచేసిన జాన్‌ను ఉదయం 9.15 గంటలకు అరెస్టు చేశామన్నారు. 24 గంటలు దాటకుండా నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో సిబ్బంది కృషి చాలా ఉందన్నారు. హత్యకేసులో అరెస్టు చేసిన జాన్‌ను రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

సూక్ష్మ కళతో దేశభక్తి

- చాక్ పీస్, పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా రూపకల్పన



చాక్ పీస్‌పై జాతీయ జెండా



రూపశిల్పి కృష్ణ స్వామి

గండేపల్లి: చాక్ పీస్, పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండాను చెక్కి తన దేశ భక్తిని చాటుకున్నాడు ద్రాక్షారామకు చెందిన పెంకే కృష్ణ స్వామి. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆయన పనిచేస్తున్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తన దేశ భక్తిని చాటుకున్నారు. జెండాను ప్రదర్శిస్తున్నట్టుగా చాక్ పీస్‌పై, పెన్సిల్ ముల్లుపై ఎగురుతున్న జాతీయ జెండాను చెక్కాడు. సహోపాధ్యాయులు, విద్యార్థులు స్వామికి అభినందనలు తెలియజేశారు. ఆయన గతంలో పెన్సిల్, చాక్ పీస్, ఆకులపై పలువురి దేశ నేతలు, రాజకీయ నాయకుల చిత్రాలను గీసి తన ప్రతిభను చాటుకున్నారు.



పెన్సిల్ ముల్లుపై జాతీయ పతాక నమూనా

700 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



పి.గన్నవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రేస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం 700 మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు ఊరేగించారు. గ్రేస్ కళాశాల నుంచి పోలీస్ స్టేషన్, మూడు రోడ్ల సెంటర్ మీదుగా కొత్త అక్విడెక్టు వరకూ జెండాను ఊరేగిస్తూ భారత్ మాతాకి జై అంటూ విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.